www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 25 మే 2023

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ కేంద్రం



కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

భీమవరం:ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఉపాధ్యాయుల సౌకర్యార్థం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆన్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారిసౌకర్యార్థం ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కార్యదర్శి కెఎస్.రామకృష్ణ, ప్రసాద్, కె.త్రిమూర్తులు, పి.రమణరాజు, సుకుమార్, రామ్మూర్తి, మురళీకృష్ణ, రహీమ్ పాల్గొన్నారు.

కూలికి వెళ్తేనే కూడు..!

- వ్యవసాయ కార్మికుల బతుకులు దుర్భరం
- ఉపాధి హామీలో యంత్రాల వినియోగంతో తగ్గిపోతున్న పనిదినాలు
- పనుల కోసం కార్మికులు ఎదురుచూపు
- ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర
- పని దినాలు పెంచాలని డిమాండ్
- జిల్లాలో కూలీల పరిస్థితులే అందుకు నిదర్శనం

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారింది. చేసుకునేందుకు కూలి పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. యంత్రాల వినియోగంతో పొలంపనులు తగ్గిపోవడం, ఉపాధిహామీ పనులు సక్రమంగా చూపకపోవడంతో కూలీలు నానాఅవస్థలు పడుతున్నారు. వ్యవసాయ కార్మికులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. పొలాల్లో పనులు తగ్గిపోవడంతో ఉపాధి పనులను ఏడాదిలో 200 రోజులకు పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

రెండు జిల్లాల్లో దాదాపు 12 లక్షలకుపైగా వ్యవసాయ కార్మికులున్నారు. వీరంతా వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనిదినాలు బాగా తగ్గిపోయాయి. ఒక ఎకరం వరిసాగుచేస్తే ఏడాదికి 30 రోజుల నుంచి 40 రోజులు పనులుండేవి. ఇక చెరకు, పొగాకు, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ సాగులోనూ పనిదినాలు పెద్దఎత్తున కూలీలకు దొరికేవి. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనిదినాలు బాగా తగ్గిపోయాయి. ఆక్వా చెరువులు పెరిగిపోయాయి. జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు వెలిశాయి. పదెకరాల ఆక్వా చెరువుకు సంబంధించి ఒకరిద్దరు ఉంటే పని పూర్తయిపోతోంది. చేపలు, రొయ్యలు పట్టుబడి పట్టే సమయంలో మాత్రమే కూలీల అవసరం ఉంటుంది. దీంతో పది ఎకరాల చేపల చెరువుల్లో ఏడాదిలో ఒకటి, రెండు రోజులు మాత్రమే పని ఉంటుంది. వరిసాగులో అయితే నారుమడి వేసినప్పటి నుంచి నాట్లు, కలుపు, కోత, నూర్పిడి, ధాన్యం తరలింపు ఇలా నిరంతరం పని ఉంటుంది. పనిదినాలు తగ్గిపోవడంతో కూలీలు ఆర్థికంగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిలేక దొరికిన పనికి వెళ్లాల్సి వస్తోంది. మహిళలు అయితే పూర్తిగా ఇంటికే పరిమితం కావాల్సి వస్తుంది. ఇలాంటి తరుణంలో ఉపాధి పనులే వ్యవసాయ కూలీలకు ఆధారంగా మారాయి.

ఉపాధి పనులే ఆధారం

వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఉపాధి పనుల కోసం కూలీలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. ఏడాదికి వందరోజులు పని కల్పించాలని నిబంధన ఉన్నా 50 రోజులు కూడా కల్పించని పరిస్థితి ఉంది. ఇల్లు గడవడం కోసం వృద్ధ కూలీలు సైతం ఉపాధి పనికి వెళ్తేనే రోజు గడిచే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పనుల్లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలకు బతుకుదెరువుగా మారింది. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఉపాధి కూలీలకు ఇచ్చే కూలి ఏమాత్రమూ సరిపోవడం లేదు. రోజుకు ఉపాధి కూలి రూ.272 ఇస్తున్నట్లు చెబుతున్నా.. కూలీలకు వచ్చేది మాత్రం రూ.240 మాత్రమే ఉంటుంది. పనులు లేకపోవడంతో ఈ కూలికే వ్యవసాయ కార్మికులు పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాదికి 200 రోజులు పనిదినాలు పెంపుచేయాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను ఆదుకునే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని మరింత మెరుగుపరచాలని కోరుతున్నారు.

ఉపాధి పనులే ఆధారం

పి. కోటేశ్వరరావు, ఉపాధి కూలీ

నా వయస్సు 70 ఏళ్లు. వ్యవసాయ పనులు ఉంటే వెళ్తాను. అపనులు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి పనులే మా కుటుంబానికి ఆధారం.ఉపాధి పనులు మరింత పెంపు చేసి, కూలి ధర పెంచాలి. ప్రస్తుతం పెరిగిన ధరలకు కూలి ఏమాత్రమూ సరిపోవడం లేదు.

ఉపాధి పని దినాలు పెంచాలి

జి.మల్లేశ్వరరావు, ఉపాధి కూలీ

వ్యవసాయ పనులు బాగా తగ్గిపోయాయి. ఇల్లు గడవడం కష్టంగా మారింది. నా వయస్సు 72 ఏళ్లు. అయినప్పటికీ ఉపాధి పనికి వస్తున్నాను. ఉపాధి పనులు లేకపోతే మరింత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఉపాధి పనులు పెంపుచేయాలి. అప్పుడే కూలీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఉపాధి హామీ పేదల హక్కు



తాడేపల్లిగూడెం మండలంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, కొలతలతో నిమిత్తం లేకుండా రూ.272 రోజు కూలి ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల పనిప్రదేశాల పర్యటనలో భాగంగా బుధవారం బాబూరావు, సోమరాజు బృందం రామన్నగూడెం, పెద్ద తాడేపల్లి గ్రామాల్లోని ఉపాధి పని ప్రదేశంలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరు గంటలకే ఆన్‌లైన్ మస్తరు విధానంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమ్మర్ అలవెన్స్, గుణపాలు, పారకు ఇచ్చే డబ్బులు నిలిపివేశారని ఉపాధి కూలీలు నాయకుల వద్ద వాపోయారు. అనంతరం నేతలు మాట్లాడుతూ రద్దు చేసిన వేసవి అలవెన్సులు కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి వీరాస్వామి, పోసిపో నవ్య, కాకర్లమూడి వెంకటరావు, గడ్డం రామచంద్రరావు, కోనపాముల ఏసుపాదం, కె.వెంకటేశ్వరరావు, నూతంగి ఏసురత్నం, పోతుల చిన్ని, బత్తిని శ్రీను, ఎర్ర రాజు పాల్గొన్నారు.

గణపవరం:ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికులు సాధించుక్కు హక్కు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం అప్పనపేటలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్ద కూలీలతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఎంఎంఎస్ యాప్‌ని వెంటనే రద్దు చేయాలన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో క్రమక్రమంగా తగ్గించేసిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని కోరారు. పే స్లిప్పులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కూలీల పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి అలవెన్సులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, మహిళా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి, మేడిశెట్టి కన్నా, పాద్రంకి రామలక్ష్మి, కర్రిసావిత్రి. కె.గోపాలం, లక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : రెండు పూటలా ఉపాధి పని విధానం రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. పోడూరులో బుధవారం ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ కూలీలకు గునపాలు, పార, తట్ట ఇవ్వాలన్నారు. సకాలంలో వేతనాలు కూలీల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మేట్లకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంగ ఆదిలక్ష్మి, బండి గణేష్, కాకర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిడమర్రు మండలంలో..



మాట్లాడుతున్న నిర్మల

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా మహిళలకు నిరంతర సేవ చేస్తున్న విఒఎల ఉద్యోగ భద్రతకు ముప్పు తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు మానుకోవాలని డ్వాక్రా యానిమేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.నిర్మల డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన యానిమేటర్ల జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి యానిమేటర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చే విధంగా చర్యలున్నాయని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పనులు అప్పగిస్తూ మరోవైపున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా యానిమేటర్లను వంచించారని తీవ్రంగా విమర్శించారు. వయసు, చదువు అంటూ పలు నిబంధనలు పెట్టి ఇప్పటి వరకూ కష్టపడి పనిచేసిన యానిమేటర్లను తొలగించాలని చేస్తున్న ప్రయత్నాన్ని వెంటనే విరమించాలని డిమాండ్ చేశారు. సొంతంగా సెల్ ఫోన్లు కొనుక్కోవాలని నిబంధన సరికాదన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 29వ తేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలు చేయకుండా గౌరవవేతనం పేరుతో బండెడు చాకిరీ చేయించుకుంటున్నారని, గౌరవ వేతనాలు కూడా సక్రమంగా అందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యానిమేటర్ల సంఘం జిల్లా నాయకులు గోవిందమ్మ, రమణకుమారి, పద్మావతి మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణ హిత జీవన శైలిలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక అల్లూరి సత్యనారాయణ సాంస్కృతిక కేంద్రం వద్ద పర్యావరణ హిత జీవన శైలి మేరీ లైఫ్‌లో భాగంగా సైకిల్ ర్యాలీని జిల్లా కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ పర్యావరణ హిత జీవనశైలి మేరీ లైఫ్‌లో భాగంగా నిన్న ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయంలో ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు వాడకుండా చర్యలు తీసుకుని, క్లాత్, నార సంచులు తదితర వాటిని వాడే అలవాటు చేసుకోవాలన్నారు. కాలుష్యం రహితంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు, తమ జీవనశైలిలో భాగంగా సైకిల్ మీద ప్రయాణాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టరు ఎం.సూర్య తేజ, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, తహశీల్దారు ఫాజిల్, ఎంపిడిఒలు ప్రసాద్‌యాదవ్, ఆనంద్ కుమార్, త్రిశూల ఎపాణీ, అధికారులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పారదర్శకంగా ఉండాలి : కలెక్టర్

నరసాపురం టౌన్: వందేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే వివాదాలకు తావులేకుండా, పారదర్శకంగా రైతులు, భూ యజమానులు మెచ్చే విధంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక అల్లూరి సత్యనారాయణ రాజు సంస్కృతిక కేంద్రంలో రెవెన్యూ, సర్వేయర్లు అధికారులకు రీ సర్వేపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో భాగస్వాములైన వారు పారదర్శకంగా, మనస్సు పెట్టి కలసి కట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు. మొదటి దశలో రీ సర్వే పశ్చిమ గోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, ఇదే స్ఫూర్తితో రెండోదశలో జిల్లాలో మిగిలిన అన్ని గ్రామాలు పూర్తిచేయాలన్నారు. ఈ సర్వేలో ప్రతి రైతును, భూ యజమానిని భూమి వద్దకు పిలిచి సర్వే చేయాలన్నారు. సర్వే ఆఫ్ ఇండియా వారి నుండి 29 గ్రామాల భూమికి సంబంధించిన మ్యాపులు వచ్చాయని, మిగిలిన మ్యాపులు జూన్ నెలాఖరుకు వస్తాయని, ఈలోపు 29 గ్రామాలు మొదలు పెట్టాలని ఆమె ఆదేశించారు. ఈ సర్వేలో డ్రోన్లు వినియోగిస్తున్నామని సిబ్బంది పూర్తి అవగాహన పొంది వేగవంతం చేయాలన్నారు. తెలియకపోవడం తప్పుకాదని తెలుసుకోకపోవడమే తప్పని, వర్క్‌షాప్ మరలా ఇంకోసారి నిర్వహిస్తామన్నారు. జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను కర్నూలు జిల్లాలో వంద గ్రామాల రీ సర్వే చేసిన పూర్తి అనుభవాలు, అక్కడ ఏదురైన సమస్యలు, ఆ సమస్యలు ఏ విధంగా పరిష్కరించింది ఆయన విపులంగా వివరించారు. రీ సర్వే అంతా పద్ధతి ప్రకారం జరగాలన్నారు. రీ సర్వే మిర్రర్ ఇమేజ్, గ్రౌండ్ రియాలిటీ ప్రకారం జరగాలని, ప్రభుత్వ భూములకు గతంలో ఉన్న సరిహద్దులను మాత్రమే తీసుకోవాలని సూచించారు. పట్టాభూమి ఎవరైతే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో సరిచేసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమి, ప్రయివేటు భూమి ఏ విధంగా చేయాలో ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ దేవరకొండ అఖిల, జిల్లా సర్వే లాండ్ రికార్డ్ ఎడి కె.జాషువ, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌ఒలు, విలేజ్ కార్యదర్శులు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బాసటగా విద్యా దీవెన : కలెక్టర్



నమూనా చెక్కును అందిస్తున్న అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పేద విద్యార్థులకు బాసటగా 'జగనన్న విద్యా దీవెన' నిలుస్తుందని, ప్రభుత్వ సాయంతో మంచి చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జగనన్న విద్యా దీవెన పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ కింద స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో విద్యార్థులకు డెమో చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థుల కళాశాల ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు ఇవ్వడంతో పాటు, వారి తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 28,201 మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను 25,194 మంది తల్లులు ఖాతాల్లో రూ.25.86 కోట్ల నగదును జమ చేశారన్నారు. ఆచంట నియోజకవర్గంలో 3,844 మందికి రూ.3.24 కోట్లు, భీమవరం 4,529 మందికి రూ.4.33 కోట్లు, నరసాపురం 3,427 మందికి రూ.2.92 కోట్లు, పాలకొల్లు 3,179 మందికి రూ.2.81 కోట్లు, తాడేపల్లిగూడెం 4,196 మందికి రూ.4.15 కోట్లు, తణుకు 4,871 మందికి రూ.4.63 కోట్లు, ఉండి 4,155 మందికి రూ.3.75 కోట్లు నగదును లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



డిఐపిఆర్ఒ నాగార్జునను సత్కరిస్తున్న సిబ్బంది

డిఐపిఆర్ఒ నాగార్జునకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం

సమాచార శాఖ డిఐపిఆర్ఒ దాసరి నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతపై కాకినాడకు వెళ్తున్న సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయం జిల్లా కోఆర్డినేటర్, కార్యాలయ సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సమాచార శాఖ డిఐపిఆర్ఒ కార్యాలయంలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న దాసరి నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం భీమవరం విధుల నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయం జిల్లా కోఆర్డినేటర్, కెసిహెచ్.అప్పారావు, కార్యాలయ సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దాసరి నాగార్జున, డిప్యూటీ డైరెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. నాగార్జున ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మీడియా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది నాగార్జునకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ కెసిహెచ్ అప్పారావు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రంగబాబు మూర్తి, శీను, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు నిరసిస్తూ టిడిపి ధర్నా

ఆందోళన చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించి, కోతలు లేని కరెంటును ప్రజలకు అందించాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో రాయపేట విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కరెంటు కోతల వల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరెంట్ కోతలు లేవని, నాణ్యమైన విద్యుత్ అందించే వారిని, ఇప్పుడు ఎందుకు కరెంటు కోతలు పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్లు వివిధ అనుబంధ కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరుగోరుమిల్లులో రైతులతో ఆందోళన చేస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్

నూకశాతం పేరుతో దోపిడీ : రైతు సంఘం

ప్రజాశక్తి - ఆచంట

ఖరీఫ్‌లో తేమ శాతం పేరుతో, రబీలో నూకశాతం సాకుతో రైతులను మిల్లర్లు దోచుకుతింటున్నా ప్రభుత్వం, అధికారులు చూసీచూడనట్లు ఉన్నారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. మండలంలోని కరుగోరుమిల్లి, కందరవల్లి, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం మాసూలు చేసి 20 రోజులైనా సంచులివ్వడం కోసం పది రోజులు ధాన్యం చూసిన తర్వాత పది రోజులు కావస్తున్నా ఇంత వరకూ ట్రాక్టర్లు గాని, లారీలు గాని రాలేదని తెలిపారు. రోజూ కాపలా కాయాల్సి వస్తోందని రైతులు వాపోయారని తెలిపారు. ఒక పక్క నూకశాతం పేరుతో కేజీ 300 గ్రాములు ఎక్కువ తీసుకున్నప్పటికీ ఇంకా రైతులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు అమలాపురపు నాగేశ్వరరావు, మిద్దే సత్యనారాయణ, గంగోలు సత్యనారాయణ, కాండ్రేగుల నాగేశ్వరరావు, గెద్దాడ రామారావు, కండెల్లి వెంకటలక్ష్మి, వందుర్తి ఆంజనేయులు, గుడాల తిరుపతిరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో భీమవరం నియోజకవర్గం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధే మా పాలన, లక్ష్యమని, నియోజకవర్గంలో శరవేగంగా అభివద్ధి పనులు జరుగుతున్నాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రూ.32 లక్షలతో ఎండిఒ ఆఫీస్ రోడ్డు మహాత్మా గాంధీ విగ్రహం నుంచి యనమదుర్రు క్రాస్ బండ్ వరకూ సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షలతో సింహాద్రి అప్పన్న గుడి నుంచి కిరాణా మర్చంట్స్ మీదుగా నాచువారి సెంటర్ రోడ్డు వరకూ బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నామన్నారు. అభివృద్ధి పథంలో భీమవరం నియోజకవర్గం ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది మెరుగైన సేవలందించే విధంగా పనిచేయాలన్నారు.

బ్యాంకు క్యాషియర్ అదృశ్యం

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు మండలం వేల్పూరు గ్రామం యూనియన్ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న మిడతాడ అప్పలనాయుడు అదృశ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. తణుకు రూరల్ ఎస్ఐ గుర్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు వేల్పూరు యూనియన్ బ్యాంకులో సుమారు రెండు సంవత్సరాల నుండి క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. బ్యాంకుకు ఎదురుగానే నివాసం ఉంటున్నాడు. బుధవారం ఎప్పటిలాగానే బ్యాంకులో విధులు నిర్వహించి, మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లి మరలా బ్యాంకు రాలేదు. ఇంటి వద్దే సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యాడని తెలిపారు. అప్పలనాయుడుకు భార్య రేణుకకు కుటుంబ కలహాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే అప్పలనాయుడు సూసైడ్ నోట్ రాసి వెళ్లిపోయి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. అప్పలనాయుడుకు సంవత్సరం వయస్సు గల పాప ఉందని తెలిపారు. భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తణుకు రూరల్ ఎస్ఐ గుర్రయ్య తెలిపారు.

28 నుండి ఆన్‌లైన్ ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి జరగనున్న 6వ నూలి సాయి అభయ్ ఆన్‌లైన్ ఓపెన్ చదరంగం పోటీల బ్రోచర్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఓపెన్ ఆన్‌లైన్ చదరంగం పోటీల్లో సుమారు 17 దేశాల నుంచి 1200 మంది క్రీడాకారులు రిజిస్టర్ అయ్యారని, ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు 50 వేల రూపాయల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ఏటా నిర్వహించడం హర్షదాయకమని తెలిపారు. ఈ పోటీలకు తాడేపల్లిగూడెం మాస్టర్ చెస్ అకాడమీ వేదిక కావడం చాలా హర్షణీయమన్నారు. ఈ పోటీల్లో 8 మంది గ్రాండ్ మాస్టర్లు, 16 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు పాల్గొంటున్నారని తెలిపారు. మాస్టర్ చెస్ అకాడమీ చైర్మన్ సిహెచ్ ఆర్కే.వర్మ, ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కంకిపాటి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం మే 20న జరిగిన సమ్మర్ క్యాంపు చదరంగం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వైసిపి యువజన నేత కొట్టు విశాల్, మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా మెడల్స్, మెమెంటోస్, సర్టిఫికెట్లు అందజేశారు.

శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని మాలవానితిప్ప సచివాలయం పరిధిలోని గోతిప్ప, ఇసుకలంక, బోస్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.20 లక్షలతో పలు సిసి రోడ్లు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ల జెడ్‌పిటిసి పి. సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీష విశ్వనాధరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి చినవంతెన పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఉండి కొత్తపేటకు వెళ్లే మార్గంలోని చిన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో స్థానికులు వాహనదారులు రైల్వే స్టేషన్ వైపు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ డిఇ కెవిఎస్.శ్రీనివాసరావు వంతెనను పరిశీలించి స్లాబ్ మార్చాలని, సుమారు 15 లక్షల రూపాయలు అవుతుందని అంచనా వేసి ఉండి పంచాయతీ పాలకవర్గానికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఉండి పంచాయతీ పాలకవర్గం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు దృష్టికి తీసుకెళ్లగా బుధవారం పివిఎల్ వంతెనను పరిశీలించారు. వంతెన స్లాబ్ నిర్మాణానికి నిధులు కేటాయించేలా జెడ్‌పి ఛైర్మన్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, వార్డు మెంబర్ నగుడు సురేష్, ఉండి రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ సభ్యులు కరిమెరక శివ నాగరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

పడవ ప్రమాదంలో మృతి చెందిన పెద్దిరాజు, వెంకటరమణ కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మృతితో ఆ రెండు కుటుంబాలు పెద్దదిక్కుని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

కొత్త పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలి

ప్రజాశక్తి - గణపవరం

ఢిల్లీలో నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటపల్లి మంగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పిప్పరలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతోపాటు అన్ని వర్గాల వారికీ హక్కులు కల్పించిన మహనీయుడని అన్నారు. ఆయన పేరు పార్లమెంటుకు పెట్టాలన్నారు. అంతేకాకుండా భారత కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు ఎస్.రాజు, టి.వెంకటేశ్వరరావు, యు.యోహాన్, వై.చంటి పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వాలంటీర్లకు వందనం'

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ గ్రామాల వారీగా వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని వేంద్ర, కొండేపూడి గ్రామాలకు చెందిన వాలంటీర్లకు ఇటీవల అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ధాన్యం సేకరణలో లక్ష్యం పెట్టడం దారుణం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ రైతును ఉత్తుత్తి రైతుగా మార్చేస్తోందని ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పులూరు గ్రామంలో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం పూర్తయిందని, పౌర సరఫరాల అధికారులు రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని రైతులు ఎంఎల్ఎ దృష్టికి బుధవారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వ్యవసాయ రైతులు ఎక్కువ ధాన్యాన్ని పండిస్తే గత ప్రభుత్వంలో ఉత్తమ రైతుగా సత్కరించే వారని, నేటి ప్రభుత్వం రైతులకు కూడా ధాన్యం పండించేందుకు లక్ష్యాన్ని విధించడం దారుణం అన్నారు. నిన్నటి వరకు తేమశాతం ఎక్కువగా ఉందని రైతుల నుండి మిల్లర్లు, అధికారులు అధిక డబ్బులు వసూలు చేశారని, నేడు తేమ శాతం తక్కువగా ఉండడంతో రైతుకు మిల్లర్లు, అధికారులు ఎదురు డబ్బులు ఇస్తారా అని ప్రశ్నించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి రైతులను ఇబ్బందులు పెట్టకుండా ఎంత పండిస్తే అంత ధాన్యం కొనుగోలు చేసేలా పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు, ఉప్పులూరు గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు, సిపిఎం నేతలు

భూములకు పరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

రైతుల నుంచి జగనన్న ఇళ్ల స్థలాల నిమిత్తం ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం అందించాలని మండుటెండలో 15 రోజులుగా పేదలు పోరాడుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. పాలకోడేరు కోటిగట్టు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములు ఇచ్చిన రైతులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారానికి 15వ రోజుకు చేరాయి. దీనిలో భాగంగా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు ఆశ్రయ దీక్ష శిబిరాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నిరుపేద రైతుల నుంచి భూములు తీసుకుని పరిహారం అడుగుతుంటే మానవత్వం లేకుండా ప్రవర్తించడం అత్యంత దుర్మార్గమన్నారు. భూములిచ్చి మూడు, నాలుగేళ్ల నుంచి పంట కోల్పోయి, పరిహారాన్ని కోల్పోయి కనీసం అధికారులు వచ్చి ఏం చేయబోతున్నారో కూడా చెప్పకపోవడం దారుణమన్నారు. నిబంధనలు ప్రకారం భూములకు నష్టపరిహారం రాదని అధికారులు చెబుతున్నారని, ఈ నిబంధనలు నిరుపేద రైతులకేనా..? భూస్వాములు, పెత్తందారులకు ఉండదా? అని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి నిరుపేద బాధిత రైతులకు పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు బాధితులకు అండగా ఉండి పోరాడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు సాయిబాబు, సత్యనారాయణ, రామలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉపాధి పాట్లు..!

అమలు కాని కనీస వేతనాలు
పని ప్రదేశంలో సౌకర్యాలు నిల్
రెండు పూటలా మస్టర్ విధానంతో కూలీల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

వ్యవసాయ పనులు దొరకని కుటుంబాలకు పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని మేధావులు రూపకల్పన చేసి పోరాడి సాధించినదే ఉపాధి హామీ చట్టం. ఈ చట్టం క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీనికి కారణం వేతన చెల్లింపుల్లో జాప్యం. ఈ చట్టం ద్వారా కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నా వాటిని ప్రభుత్వాలు దారి మళ్లిస్తుండడంతో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా తయారైంది. తమకు అరకొర వేతనాలు చెల్లించడం, సరిగ్గా పని చెప్పకపోవడం, యాంత్రీకరణ పేరుతో పనులు లేకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తోందని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు.

మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో 450 శ్రమ శక్తి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల ద్వారా రోజుకు సుమారు 2000 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలి. రోజుకు కనీసం రూ.272 వేతనం చెల్లించాలి. అయితే ఏ ఒక్క కూలీకీ ఆ విధంగా చెల్లించిన దాఖలాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీకి నిధులు పెంచాల్సి పోయి కేంద్రం కోత విధించడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు. 1990కి ముందు నయా ఉదారవాద విధానాలు రాక ముందు పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరు. గ్రామీణ ప్రాంతాల్లో నాట్ల నుంచి కోతలు, నూర్పిళ్ల వరకూ వ్యవసాయ కార్మికులు పని చేసేవారు. ఈ తరహాలో 1990 తర్వాత వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ రావడంతో ఉపాధి హామీ పని దినాలను



పెనుమంచిలిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు సిర్రా నరసింహమూర్తి

మింగేశాయి. వాణిజ్య పంటల పేరుతో ఆక్వాసాగు వచ్చిన తరువాత వ్యవసాయ భూములన్నీ ఉప్పు కయ్యలుగా మారడంతో ఉపాధి మరింత కనుమరుగైంది. దీనికితోడు రియల్ ఎస్టేట్ పేరుతో వ్యవసాయ భూములన్నీ ప్లాట్లుగా మారడంతో వలసలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికులకు పనుల్లేని రోజుల్లో పని అయినా చూపాలి, తిండైనా పెట్టాలి అనే నినాదంతో 2000లో రాష్ట్రాల్లో ఎఫ్‌సిఐ గోడౌన్ల ముట్టడి ఫలితంగా నాడు పనికి ఆహార పథకం పని చేస్తే, భయం వచ్చేలా ప్రభుత్వ అమలు చేసింది కానీ అది కూడా పేదలందరికీ అందేది కాదు. నాడు యుపి-1 ప్రభుత్వం వామపక్షాలపై ఆధారపడి ఉన్న ఫలితంగా పార్లమెంటులో ఎంపీలు గట్టిగా పట్టు పట్టడంతో కూలీలకు పర్మినెంట్ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టారు. 2005 ఫిబ్రవరి నుంచి మనకు ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చింది.

నేడు వ్యవసాయ విస్తీర్ణం తగ్గడం, యాంత్రీకరణ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పనులు ఉండడం లేదు. దీనికితోడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూనే ఉంది. బడ్జెట్లో కోతలు పెడుతోంది. గతంలో 20 మంది ఒక గ్రూపుగా ఉండేవారు. ప్రస్తుతం 60 నుంచి 70 మంది గ్రూపుగా ఉంటున్నారు. వేసవి నేపథ్యంలో కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు మే, జూన్‌లో 30 శాతం వరకూ ఇచ్చేవారు. ప్రస్తుతం వాటిని తొలగించారు. పని ప్రాంతంలో టెంట్, మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ తదితర సౌకర్యాలు ఉండేవి. ప్రస్తుతం వాటిని తొలగించారు.చట్టంలో మంజూరైన నిధులు 60 శాతం లేబర్ కాంపోనెంట్ కూలీల ఖర్చు చేయాలి. మిగిలిన 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని స్పష్టంగా ఉన్నా నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు.

రెండు పూటలా మస్టర్‌తో అవస్థలు

నాడు మేట్లు మాష్టర్ షీటుపై హాజరు వేస్తే కూలీలు మస్టర్ వేసేవారు. నేడు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకువచ్చి మేట్ల స్థానంలో సైట్ సూపర్‌వెబ్‌గా పేరు మార్చి ఉదయం పని వద్ద స్మార్ట్ ఫోన్ల ద్వారా ఒక ఫొటో, మధ్యాహ్నం పని వద్ద మరో ఫొటో తీసి మస్టర్ వేసే విధానాన్ని తీసుకురావడం కూలీలకు శాపంగా మారింది. రెండు పూటలా పని పెంచారు గానీ దానికి తగ్గట్టుగా వేతనం మాత్రం పెంచలేదు. జాబ్ కార్డుల ప్రకారం కూలీలకు పనులు కల్పించాలి. ఉపాధి హామీ కూలీలకు రూ.2.50 లక్షల కోట్లు బడ్జెట్లో కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.63 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. 2003 ఏప్రిల్ నుంచి వేతనం మరో రూ.15 పెంచినట్లుగా ప్రకటించినా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను బట్టి చూస్తే ఇది సరిపోదని కూలీలు వాపోతున్నారు.

డిమాండ్లు ఇవే.. ★★★

పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.272 నుంచి రూ.600 పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పని దినాలు 200 రోజులు వరకూ పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. సమ్మర్ అలవెన్స్ కొనసాగించి తొలగించిన సౌకర్యాలను పునరుద్ధరించాలి. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలి. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి.. ★★★

వర్ధనపు కనకలక్ష్మి, ఉపాధి కూలి,పెనుమంచిలి

ఉపాధి పనుల వద్ద కనీస వసతులేవు. తాగడానికి నీటిని ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. ఈ ఎండలకు ఆ నీరు వేడెక్కిపోతోంది. సొమ్మసిల్లి పడిపోతామనే భయమేస్తోంది. ఎండలకు పనిచేయలేకపోతున్నాం. వ్యవసాయ పనులు లేకపోవడంతో అర్ధాకలితో ఉండలేక ఈ పనులు చేస్తున్నాం. కనీస సౌకర్యాలు కల్పించాలి.

పస్తులుంటున్నాం.. ★★★

వర్ధనపు లక్ష్మి, ఉపాధి కూలి, పెనుమంచిలి

వ్యవసాయంలో యాంత్రీకరణ రావడంతో మాకు పనుల్లేకుండా పోయాయి. పస్తులుంటున్నాం. ఉపాధి హామీ పనుల ద్వారా కనీస వేతనం రూ.600లకు పెంచాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.272 సరిపోవడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ రూ.600లకు పెంచాలి.

ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేయాలి.. ★★★

గెద్దం బాబూరావు, ఉపాధి కూలీ, పెనుమంచిలి

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను పరిగణలోకి తీసుకుని కేంద్రం బడ్జెట్‌లో నిధులను పెంచాలి. కూలీలకు వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా కేవలం 30 రోజులు మాత్రమే కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతిలో కొనసాగించాలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.. ★★★

మానుకొండ రాంబాబు, ఉపాధి కూలీ, పెనుమంచిలి

పని ప్రదేశాల్లో తగు సౌకర్యాలు కల్పించాలి. వంద రోజులు పని అంటున్నారు కనీసం 30 రోజులు కూడా కల్పించడం లేదు. రోజుకు రూ.272 ప్రభుత్వం ప్రకటించినా మాకిచ్చేది రూ.250 మాత్రమే. సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలి. ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలి. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

ప్రయాణికులకు మజ్జి ఇస్తున్న దాత శ్రీనివాస్

సిపిఎం సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం

మండు వేసవిలో ప్రజల సహాయార్థం సిపిఎం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని దాత కొత్త శ్రీనివాస్ కొనియాడారు. మెంటేవారితోటలోని సుందరయ్య భవనం వద్ద సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈ నెల 19న ప్రారంభించిన మజ్జిగ చలివేంద్రానికి ప్రముఖ వ్యాపారవేత్త కొత్త రాధాకృష్ణమూర్తి, మహాలక్ష్మి దంపతుల సౌజన్యంతో పది రోజుల పాటు రోజుకు 20 లీటర్ల చొప్పున మజ్జిగ అందజేశారు. దీనిలో భాగంగా చలివేంద్ర వద్ద మజ్జిగను ప్రయాణికులకు, పాదాచారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి కృషి చేస్తున్న సిపిఎం చేసిన సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సిపిఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ పట్టణంలో దాతల సహకారంతో 35 కేంద్రాల్లో మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత కొత్త శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, రత్నకుమారి, రాజీవ్, రఫెల్, రాధాకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోందని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు విమర్శించారు. పొలమూరులో ఉపాధి హామీ చట్టం పరిరక్షణ పర్యటనలో భాగంగా సుబ్బరాజు కూలీలతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ధరలూ పెరిగిపోయాయని తెలిపారు. మండుటెండలో కనీసం తాగునీరు కూడా కల్పించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, చింతపల్లి తిరుమలరావు, చింతపల్లి మావో, కేతా ప్రమోద్, కమిటీ సభ్యులుగా జక్కంశెట్టి ధనశ్రీలక్ష్మి, దొంగ భవాని, పెశ్చెట్టి బుజ్జి లక్ష్మి తదితరులు కమిటీ సభ్యులు ఏర్పడ్డారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పోడూరు

విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖరబాబు సూచించారు. జిన్నూరు శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులో మాట్లాడుతూ గ్రంథాలయంలో అందరికీ అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి తమ విలువైన సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థీ గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకురాలు బత్తుల జోగారత్నం, బండారి వెంకటరమణ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కె.హైందవి అన్నారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కోడేరు గ్రామ పంచాయతీ హెల్త్ సెంటర్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హైందవి రోగులను పరీక్షించి తగు సూచనలు సలహాలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.మోహన్, ఎంఎల్‌హెచ్‌పిలు ఎస్.రేణుక, ఝాన్సీ, డిఇఒ రమాదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు : కాళీపట్నం తూర్పు పంచాయతీలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ సిహెచ్ సుధాకర్ పలువురిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. దీర్ఘకాలంగా రోగంతో బాధపడుతూ లేవలేని పరిస్థితిలో ఉన్నవారి ఇంటికెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డి.జోషి, సిహెచ్ ఆనంద్‌శేఖర్, నీరజ, జ్ఞానానంద పాల్గొన్నారు.

ఎంపిపి నారాయణరాజుకు సత్కారం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ఎంపిపిల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజును బుధవారం ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మండల సర్పంచులు, ఎంపిటిసిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పాల్గొని శ్రీహరి నారాయణరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఎంపిపి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీహరి నారాయణరాజుపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఆయన పై ఉందన్నారు. అనంతరం ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి రావడానికి సహకారం అందించిన పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పంట బోదె పనులను పరిశీలిస్తున్న ఎపిఒ

చురుగ్గా పంట బోదె తవ్వకం పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వారతిప్ప, కొత్తట, కాళీపట్నం తూర్పు, కెపిపాలెం నార్త్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. బుధవారం వారతిప్ప గ్రామంలో చేపట్టిన తవ్వకం పనులను, మస్తరును ఎపిఒ వై.శ్రీనివాస్ పరిశీలించారు.

వేసవి శిబిరాలను ఉపయోగించుకోవాలి

గణపవరం:వేసవి సెలవుల్లో స్థానిక గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని వైసిపి నాయకులు కాకర శ్యామ్ అన్నారు. బుధవారం పిప్పర గ్రంథాలయంలో బైరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకటి నుండి 10వ తరగతి విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పాల్గొని తమ జ్ఞాన సంపదను పెంచుకోవాలని కోరారు. గ్రంథ పాలకులు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఐవి.నరసింహరాజు, పోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఈ పత్రికా ప్రకటన మూలంగా యావన్మందికీ తెలియజేయునది.., మా సంఘములో **శ్రీమతి ఆసు రజని, భర్త: వెంకటేశ్వరరావు,** జన్మస్థలం మునమర్రు, 2005 సంవత్సరంలో వారి తాలూకు ఒరిజినల్ దస్తావేజులు తనఖా పెట్టి ఋణం పొందియున్నారు. సదరు దస్తావేజులు మరియు రెవెన్యూ టైటిల్ డీడ్స్ కనబడుట లేదు. దానిపై విచారణ చేయగా పూర్వపు కార్యదర్శిగా వారు పని చేయుకాలం నుండి కనిపించలేదని చెప్పియున్నారు. అన్ని ప్రయత్నములు చేసిన తర్వాత ఈ ప్రకటన ఇచ్చుచున్నాను. ఈ దిగువ తెలిపిన దస్తావేజులు ఒరిజినల్స్ ఆచూకీ తెలిసినచో ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

<u>దస్తావేజు వివరాలు</u>

1) దస్తావేజు నెం. 1869/2001లో మునమర్రు గ్రామం భూమి ఆర్.ఎస్.నెం. 113లో య.0-43 సెంట్లు. ఆర్.ఎస్.నెం. 71/3లో య.0-54 సెంట్లు. ఆర్.ఎస్.నెం. 71/3బి లో య.0-06 సెంట్లు.
2) దస్తావేజు నెం. 309/1998లో ఆర్.ఎస్.నెం. 71/1లో య.0-60 సెంట్లు.
3) దస్తావేజు నెం. 1871/2001లో ఆర్.ఎస్.నెం. 90/2లో య.0-50 సెంట్లు.

ధరణాల నాగపోల సింహాద్రి మణికంఠ
సెక్రటరీ, శ్రీగాంధీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
రి.నెం. 6/1/1954, మునమర్రు.
సెల్: 77020 08189

<u>పత్రికా ప్రకటన</u>

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

ఇ.పి.నెం.34/2022
<u>ఇన్ ఓ.ఎస్.నెం.308/2018</u>

<u>బిట్వీన్:</u>
మొగలపు వెంకట దుర్గ ***...డి. హెచ్.ఆర్ /వాది***
మరియు
దేవ బాలకృష్ణ ***...జె.డి.ఆర్ /ప్రతివాది***

<u>జె.డి.ఆర్:</u> దేవ బాలకృష్ణ, తండ్రి: పోలారావు, వయసు 48 సం॥లు, డో.నెం. 3-45, వ్యాపారము, జగన్నాథపురం, TPG PJCJ.

పై నెంబరు గ్రంథమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్ననూ మీరు సదరు నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై గ్రంథములో ది.19-06-2023వ తేదీ అయి ఉన్నది. కావున సదరు వాయిదాకు మీరు గాని మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.19-06-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ముళ్ళపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 94919 78178

మహానాడుకు తరలిరావాలి

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 27, 28 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించే టిడిపి మహానాడుకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. బుధవారం స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో తణుకు నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడుకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. నియోజవర్గంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు వినతిపత్ర రూపంలో సేకరించి నరసాపురం పార్లమెంట్ పార్టీ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ డాక్టర్ శ్యామ్‌చంద్ర శేషు, తణుకు పట్టణ అధ్యక్షుడు కలవర వెంకటకృష్ణ, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు: ఈసారి మహానాడుకు ప్రాముఖ్యత ఉందని, గోదావరి జిల్లాలో నిర్వహించడమే కాకుండా, ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా జరుపుకోవడం అదృష్టమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం పార్టీ ఆఫీసులో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. సభకు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి నినాదాలతో టిడిపి పుట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కోడి విజయ భాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కడలి గోపి, జివి పీతల శ్రీను పాల్గొన్నారు.

పెనుగొండ : టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కోరారు. పెనుగొండలోని ఫంక్షన్ హాల్లో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన రాజమండ్రిలో జరగబోయే మహానాడు కార్యక్రమానికి భారీ ఎత్తున కార్యకర్తలు, అభిమానులందరూ రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నేతలు బాబు రాజేంద్రప్రసాద్, గంధం వెంకటరాజు, గుత్తుల లోకేష్ నక్కా వేద శాస్త్రి పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్లలో ఇంటిగ్రేడ్ హాస్టల్లో వాలంటీర్లను బుధవారం సత్కరించారు. కాళ్ల, కోనలపల్లి, సీసలి, కోమటిగుంట, కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాల వాలంటీర్లకు వందనం గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలకు సేవా మిత్ర, సేవారత్న సేవా వజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, ఆయా గ్రామాల ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.